# ఎంతెంతెంత దూరం

మరుల తీగెను తొక్కి, మార్గం మర్చిపోయిన మందభాగ్యుడిలా మాధవ్ హాల్లోంచి పడకగదిలోకి, అక్కడ్నుంచి వరండాలోకి, మళ్లీ వరండాలోంచి వంటింట్లోకి, అక్కడ్నుంచి డైనింగ్ హాల్లోకి, మళ్లీ అక్కడా నిలబడక డ్రాయింగ్ రూమ్‌లోకి - ఇలా కాళ్లు అరిగిపోయేలా తిరుగుతున్నాడేగానీ ఆ తిరుగుడికి అంతూ పంతూ లేకుండా వుంది. అతని బుర్రలోని ఆలోచనలు కూడా అంతూ దరీ లేకుండా పిచ్చి పిచ్చిగా పరుగెడుతున్నాయి. ఆలోచనల తీవ్రత పెరిగే కొద్దీ అతని అడుగుల వేగం పెరుగుతోంది. అయితే మాత్రం ఏం ? - గుండ్రాలు గుండ్రాలుగా అతని పయనం అక్కడక్కడే గిరిటీలు కొడుతోంది.

అత్యంత పెద్ద చదువు చదివి, అత్యంత సంపదగల అమెరికాలో అత్యంత ఉన్నతమైన ఉద్యోగంలో అత్యంత ఘనమైన డబ్బు సంపాదిస్తున్న మాధవ్ - అత్యంత పసివాడు కాకపోయినా, అమాయకంగా సమస్య సృష్టించుకుని పసివాడిలా తల్లడిల్లి పోతున్నాడు తల్లి సమక్షంలో.

చిన్న వయసులోనే భర్తని కోల్పోయిన సరస్వతి, ఏకుల కట్టలా తెల్లగా బలహీనంగా చేతుల్లో మిగిలిన చంటిబిడ్డ, మాధవ్‌ని చూసుకునే బతకడం మొదలు పెట్టింది.

అండదండలు లేకపోతే మగపిల్లాడ్ని పెంచి, ప్రయోజకుడ్ని చేయడం కష్టమని భావించి సరస్వతి మామగారింట్లోనే సర్దుకుని ఉండిపోయింది. అత్తగారెలాగూ లేదు, ఉన్న ముసలి మామగార్ని కాదని, చేసేదేముందని అన్నదమ్ములు రమ్మన్నా వెళ్ళకుండా ఉండిపోయింది.

పెద్దకొడుకు డాక్టరై అమెరికా వెళ్ళి అక్కడే స్థిరపడిపోయి, రెండో కొడుకు అర్థాంతరంగా చనిపోవడంతో ముసలాయనికి కోడలే దిక్కైంది. అందుకే ఆమెంటే అభిమానం కురిపించాడాయన.

మెరికలాంటి మాధవ్ చదువులో చురుకుగా ముందుకు సాగాడు. తాతగారు మంచానపడినపుడు వచ్చాడు అమెరికా నుండి బోసు పెదనాన్న అప్పుడు చూశాడు మాధవ్ ఆయన్ని. తాతగారు తనని ఆయన చేతిలో పెట్టి ''పోయిన నీ తమ్ముడు పోనే పోయాడు. ఈ నలుసు వాడి గుర్తు. వీడు తెలివిలో వాళ్ళ నాన్నకి పదిరెట్లు. నువ్వే వీడి బాధ్యత తీసుకుని వృద్ధిలోకి తీసుకొచ్చి మన కుటుంబ గౌరవం నిలబెట్టాలి'' అని కన్నుమూశాడు.

బోసు పెదనాన్న వెంట బయలుదేరినప్పుడు మాధవ్ అమ్మ గురించి కొంత బెంగ పెట్టుకున్నమాట నిజమే కానీ అతను చదువులో పడిపోయాక అతన్నదేమీ ఎక్కువ బాధించలేదు.

కొందరు కాలిఫోర్నియాలో వున్నా, కంకిపాడులో ఉన్నా మానసికంగా పెద్ద మార్పేమీ పొందరు. మన మాధవ్ కూడా అలాంటివాడే.

ఎప్పుడైనా చిన్న చిన్న ఉత్తరాలు అప్పచెప్పినట్లు రాయడం – ఫోనులో మాట్లాడటం – 'నేను బాగున్నాను' – నువ్వెలా ఉన్నావు – ఆరోగ్యం జాగ్రత్త – ఇంతే.

అయితే తల్లిమాత్రం కాస్త పెద్ద ఉత్తరాలే రాసేది. అతని మనసులో నాటుకున్నవి ఉత్తరాల్లో విశేషాలే. ఆమె తరుచూ ''ఒరేయ్ ! మాధవా ! నీకు పెళ్ళి చెయ్యాలిరా. మంచి సంప్రదాయ సిద్ధమైన పిల్లని – బాగా డబ్బున్న గొప్పింటి పిల్లని – కళ్ళు మిరిమిట్లు గొలిపే అందాల చక్కని చుక్కని పెళ్ళి చెయ్యాలిరా – పిల్ల – తెల్లగా, ఎత్తుగా, జుత్తు నల్లగా కళ్ళు పెద్దగా పళ్ళు ముత్యాల సరులులా – నాకోడలు బంగారు బొమ్మలా వంటినిండా బంగారు తొడుగుతో...'' అంటూ ఆమె గొంతెమ్మ కోరికలతో ఉత్తరం నింపేది. మాధవ్‌కి ఆ ఉత్తరాలు పదిసార్లు చదవడం కాలక్షేపం – అలవాటు అయిపోయి, ఎప్పుడూ పెళ్ళి అనే మాట మనసులోకి వచ్చినా అమ్మ మాటలన్నీ చెవులో మారు మ్రోగేవి''

అంతమాత్రాన మాధవ్ ఆడపిల్లల మీద మనసు పడలేదనుకుంటే అది అబద్ధమే అవుతుంది.

కానీ ఏ పిల్లని చూసి మనసు ముచ్చటపడినా మనసు నిలేసేది –

''ఆ పిల్ల సంప్రదాయమేమిటి?''

''వాళ్ళకి డబ్బుందా ?''

''చాలా అందంగా ఉందా? అమ్మకి నచ్చుతుందా?''

జుట్టు నల్లగా లేదు. ఎర్రగా ఉంది. మరి ఎలా ?''

''కళ్ళు అందంగా ఉన్నాయి. పెద్ద కళ్ళుంటే ఏమిటి ? ఎలా ఉండాలి ?''

''బంగారు బొమ్మేనా? మరి బంగారు తొడుగో ! ! !''

మరింక ఆలోచించలేక – ఈ గోలంతా వద్దు బాబోయ్, అమ్మ చూస్తుంది కదా! అని సరిపెట్టేసుకునేవాడు.

★ ★ ★ ★

పదేళ్ల గిర్రున తిరిగాయి. ముప్పై రెండేళ్ళ మాధవ్ ఎలాగైనా పెళ్ళి చేసుకుని తిరుగుప్రయాణంలో అమ్మాయినా అమెరికా తీసుకుపోదామని నలభై రోజులు శలవు పెట్టి ఇండియా వచ్చాడు. ముప్పై రోజులయి పోయాయి. వరుసగా ఓ అయిదుగురు అమ్మాయిల్ని చూసేశారు. అయితే చూసిన ప్రతి సంబంధానికి ఏదో ఒక వంక పెడుతూ వచ్చింది సరస్వతి.

''ఏమిట్రా ఆ పిల్ల ? మరీ మగాడికి ఆడవేషం వేసినట్టుందీ...''

''జుత్తు నొక్కులుగా వుందిగానీ, పొడుగు లేదురా – మరీ భుజాల మీదకుంది'' – చప్పరింత.

''ఆ ముక్కేమిటిరా నాయనా – సోడాలెత్తి పెట్టినట్టు''

''ఒరేయ్ మధూ ! పిల్ల కనిపించినంత రంగు కాదురోయ్ – దట్టంగా మేకప్ కొట్టినట్టున్నారు''

''నీ హోదాకి తగ్గట్టు ముట్ట చెప్తారంటావా''

''ఏమో – కట్నం, బంగారం విషయంలో నాకనుమానమే''

ఇలా మాధవ్ నోట్లంచి మాట వూడిపడకుండానే సరస్వతి అందుకుని ఏదో ఒకటి అనేసేది. తల్లి వ్యతిరేక భావం వ్యక్త పరిచాక మాధవ్‌కి మరేం మాట్లాడబుద్దేసేది కాదు.

మాధవ్ ఎంతమంది అమ్మాయిల్ని చూసినా వీరందరికంటే అన్నిటిలోనూ తన అమెరికా మిత్రురాలు ఫ్లారెన్స్ ఎంతో బాగున్నట్లు తరుచూ అనిపించేది.

మనిషికి జీవితభాగస్వామి కావడానికీ – అమ్మ చెప్పిన వాటికంటే చాలా ముఖ్యమైనదేదో ఉందనే విషయం అతనికి నెమ్మదిగా అర్థం కాసాగింది.

''ఎందుకలా కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ నన్ను విసుక్కుంటావు ? నీకంత గా కావాలంటే ఎవర్నైనా ప్రేమించి పెళ్ళాడేయక పోయావా'' అంది సరస్వతి విసురుగా, విసుగ్గా.

మాధవ్ సర్రున తల్లివైపు తిరిగాడు.

''నువ్వెప్పుడైనా అమ్మాయిని ప్రేమించమని చెప్పావా ? రాశావా'' అని ఒక తెలివి తక్కువ ప్రశ్నవేసి, తన గదిలోకి వెళ్ళి ధామ్మని తలుపు మూసుకున్నాడు.

★ ★ ★ ★

మధ్యాహ్నం పోస్టులో వచ్చిన ఎయిర్‌మెయిల్ చూసి ఆశ్చర్యంతో, ఆత్రుతతో కవరు విప్పాడు మాధవ్.

ముత్యాల్లాంటి ఇంగ్లీషు అక్షరాల వెంట అతని చూపులు పరుగుపెట్టాయి.

మాధవ్ !

పెళ్ళి చేసుకోడానికి వధువు కోసం ఇండియా వెళ్ళావని తెలిసింది. మన స్నేహానికి నీవిచ్చిన అర్థం యిదేనన్న మాట. ప్రేమ అనే మాట మాటల్లో చెప్పాలని నాకు తెలిసింది కాదు.

నీ ప్రియమైన ఫ్లారెన్స్ --

మాధవ్ పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. ఒక్క క్షణం మనసు గాలిలోకి లేచింది.

''అమ్మా......'' ఒక గావుకేక పెట్టాడు.

''ఏమిట్రా హడలి చచ్చాను నీకేక విని'' అంటూ వచ్చింది సరస్వతి.

''నువ్వింక పెళ్ళికూతుళ్ల వేట ఆపు. నేను పదిరోజుల్లో అమెరికా వెళ్లిపోతున్నా''

''ఆ.....'' నోరు తెరిచి వుండిపోయింది సరస్వతి.

హ్యాపీలైఫ్
మాసపత్రిక